


# బారెడు నేలా..! గుప్పెడు గింజలూ..!!

ఏ తుపాను రాక్షసో కాటేసిన గుర్తుగా ఇళ్లన్నీ కొద్దిగానో, పెద్దగానో ఒరిగిపోయి ఉన్నాయి. ఒరిగిన ఇళ్లను విప్పదీసి కట్టుకునే పరిస్థితి లో కూడా లేనట్టుంది.

హఠాత్తుగా నిద్ర కుబుసం విడిచింది.

ఎక్కడున్నానో కాసేపు అర్థం కాలేదు.

ఎక్కడో దూరాన వాన కురిసి వెలిసినట్టుంది. మట్టి తడిసిన వానన నా మీది నుంచి దూకుడుగా కదిలిపోయింది. గాలి ఒక్కసారి విసురుగా వీచింది. మర్రికొమ్మల్లోని పిట్టలు కలకలమై కాసేపటికి చెట్టు మీద సర్దుకున్నాయి.

ఆకాశాన తెల్లటి మేఘాల కొండలు దూది పింజల్లా తేలుతూ ఒక దాని వెనుక ఒకటి రెక్కలు కట్టుకుని పరుగెత్తు తున్నాయి. చుక్కల జాడ లేదు గాని పూర్ణచంద్రుడు సైతం వాటి దూకుడుకు హడావుడి పడుతూ అటూ ఇటూ

## కొట్రగడ్డ దయానంద్

అనహనంగా కదులుతున్నాడు. పక్కకు తిరిగి పడుకున్న వాడినల్లా ఒత్తిగిలి వెల్లకిలా పడుకుని ఆకాశాన్ని చూస్తున్నాను.

ఎగిరిపోతున్న మేఘ మొకటి నా పెదాల మీద రెండే రెండు చినుకులు రాల్చింది. ఒళ్ళంతా జలదరించి నంబర పడిపోయాను. తడిగాలి తేమగా ఆప్యాయంగా నన్ను ఒరునుకుంటూ వెళ్ళింది.

ఎక్కడో వేలమైళ్ళ దూరానున్న యుద్ధభూమి నుంచి అలిసి పోయి వచ్చేను. ఇంకో ఆరుమైళ్ళు నడిస్తే మా ఊరు వస్తుంది. అప్పుడు అమ్మ నన్ను చుట్టుకుంటుంది. నాన్న నన్ను పెనవేసుకుపోతాడు. తమ్ముడు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తాడు.

పదేళ్ళ తర్వాత మా ఊరూ, మా ఇల్లూ, మా చెరువూ, మా చేలూ...అన్నీ నాలో, కాదు... నేనే అన్నిట్లో కలిసిపోతాను.

నిజానికి రాత్రే నడుస్తూ వెళ్ళి మా ఊరి ఒడిలో వాలాల్సింది. అలా జరగకుండా రాధయ్య సెట్టి నన్ను ఆపేడు. మా ఊరివాళ్ళు ఏ ఊరైనా వెళ్ళడానికైనా, మా ఊరు చేరడానికైనా ముందు సెట్టి బంకు దగ్గర చేరేవాళ్ళు. నే నక్కడకు చేరగానే కిరాణా బంకు అక్కడ లేదు. సెట్టి పొద్దున్నే ఇడ్లీలూ, కాఫీ అమ్మే పూరిగుడిసె దాని వెనక లేనేలేదు ఆ స్థానంలో లంకంత మేడ కొలువుదీరి ఉంది. దారి తప్పేనేమో అని చుట్టూ చూసేను.

అప్పుడే ఆ మిద్దె తలుపులు తెరుచుకుని ఇంటి వెలుతురులోంచి బయట చీకట్లోకి వచ్చే రెవరో.

"సీమ కోమటాయన ఇల్లు ఇదేనా?" అని అడిగేను.

ఆ మొహం అనహనంగా కదిలి "ఎవరు కావాలి?" అని అడిగింది. ఆయన బాగా ఉబ్బి ఉన్నాడు. కడుపు పున్నీళ్ళ బాన అంత ఉండి అనహ్యంగా ఉంది. ఆ చీకట్లో కూడా మెడలోని బంగారు దండా, చేతి ఉంగరాలూ వెలుతురు చూపుతున్నాయి.

రాధయ్య సెట్టి కావాలన్నాను. "ఏమిటి పని" అన్నట్టు చూసి "ఎవుల తాలూకూ?" అని అడిగేడు.

చెప్పేను.

"ఓహో! పదేళ్ళనాడు ఇంట్లోంచి పారిపోయినోడివి కదూ? ఎంత ఎదిగేవురా నన్నే గుర్తు పట్టలేకుండా!" అని నా భజమ్మీది ట్రంకు పెట్టెను, చేతిలో బాగును ఆరాగా చూసేడు. నా ఎదుగుదలేమో గాని ఆయన ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

అప్పుడు ఇంటింటికీ తిరిగి ఆడోళ్ళతో 'ఆడంగిలి' మాటలు చెబుతూ వెన్నపూస కొనేవాడు సెట్టి. పాలూ, పెరుగూ కొని పట్నంలో అమ్మేవాడు. పంట కాలంలో రైతుల కాళ్ళూ గడ్డాలు పట్టుకుని ఒక రూపాయి తక్కువకే ధాన్యం కొలుచుకునే వాడు. రైతుల క్కావల్సిన సరుకులన్నీ తన దుకాణాన్నుంచే అప్పుగా ఇచ్చేవాడు.

అటువంటి రాధయ్యసెట్టి, అందరూ ఎగతాళిగా పిలిచే 'సీమకోమటాయన' ఇవాళ ఇంత పెద్ద బంగళా కట్టుకుని ఒంటినిండా బంగారంతో తులతూగుతున్నాడు. ఈయన పనే ఇట్లుంటే రైతుల పని ఇంకెంత సరసంగా ఉందో కదా" అనిపించింది నాకు.

"మీ ఊరి దారి ఏమంత బాలేదు. రాత్రిపూట ముళ్ళ పందులవీ తిరుగుతున్నాయి. ఇంత రేత్రి తోడులేకుండా వెళ్ళడం మంచిదికాదు. మా ఇంట్లోనే ఇంత తిని. తెల్లారి లేచి పో!" అన్నాడు సెట్టి.

మూడు రూపాయలిచ్చి సెట్టి ఇంట్లో తిన్నాను. మంచం మీద దుప్పటి పరుచుకుని ఈ చెట్టు కింద పడుకున్నాను.

ఆలోచన ఆగిపోయింది. లేచి కూచున్నాను. ఎక్కడి నుంచో ఒక పొడి దగ్గు వచ్చి గాలిలో కలిసింది. మళ్ళీ మంచం మీదికి ఒరగబోతుంటే ఘల్లు ఘల్లున గంటలు వినసొంపుగా శబ్దించేయి. దాని వెనకనే బండి గీరల శబ్దం గరగరమని వినిపించింది. "హావ్! హెూవ్!!" అంటూ సెట్టి ఇంటి ముందుకు ఎద్దుల బండి వచ్చి ఆగింది.

బండి నగలో నుంచి చెర్నాకోలు పట్టుకుని ఎవరో కిందికి గెంతేరు. బండి మీది బస్తాల మీంచి చుట్టతాగుతూ ఒంటికి చుట్టుకున్న దుప్పటిని భుజం మీదికి లాక్కుంటూ ఇంకొకాయన కిందికి దిగేడు. ఇద్దరూ కలిసి ఎద్దుల్ని విప్పి ఏవో బూతులతో అదిలిస్తూ గంగిరేగు చెట్టుకు కట్టేసేరు. సెట్టి ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. వాళ్ళు ఏదో మాట్లాడుకున్నారు. వచ్చిన వాళ్ళిద్దరూ సెట్టి ఇంట్లోకి ధాన్యం మోసేరు.

వాళ్ళు నా మంచం దగ్గరకు వచ్చేరు. లేచి నిలబడి మా బాబాయిని గుర్తించేను. ఎప్పుడూ మెత్తటి తెల్లటి సిల్కు చొక్కాలు వేసుకుని జీతగాడితో పని చేయించే బాబాయి, ఇవ్వాల రాధయ్య సెట్టి ఇంటికి ధాన్యం మొయ్యడం చూడాల్సొచ్చింది. ఇంకా ఏమేమి మార్పులు చూడాల్సొస్తుందో అని నా గుండెలు చిత్రంగా కొట్టుకుంటున్నాయి.

ఆయన నా ముఖంలో ముఖం పెట్టి, భుజంమీద చేతులేసి పరిశీలనగా చూస్తూ "ఎన్నాళ్ళైందిరా నువ్వు ఊరు వదిలిపెట్టి? ఇన్ని రోజులకు మేము గుర్తొచ్చేమా?" అన్నాడు.

నేను - నవ్వి "అందరూ బాగున్నారా? వసంతా, లక్ష్మి ఎలా ఉన్నా"రని అడిగేను.

ఆయనా నవ్వి ఊరుకున్నాడు. ఎడంగా నుంచున్న వాడిని చూపిస్తూ "గుర్తుపట్టలేదా? మన నారాయణం బాబుగారి వీర్రాగవులు!" అన్నాడు బాబాయి.

అప్పటి వీర్రాగవులు గుర్తొచ్చేడు వాడి వెనకే రామాలకుంటా, కుంటలో బర్రెగొడ్ల తోకలు పట్టుకుని నేర్చుకున్న ఈత, రహస్యంగా తాగిన బీరతీగెల బీడీలూ, చాకలి లచ్చి ఏట్లో ఇసుక రుద్దుకుని దిగంబరంగా స్నానం చేస్తుంటే ఉద్విగ్నంగా చూడటం, సాయంత్రం ఇంటికొస్తూ బర్రెగొడ్లమీద కూర్చుని పాడుకున్న "జెండాపై కపిరాజు" పద్యాలూ.... అన్నీ గుర్తొచ్చి ఉక్కిరిబిక్కిరయ్యేను.

మే మందరం పదో తరగతి దాకా పక్కూరుకు నడిచి వెళ్ళి చదివితే వాడు చదువూ చట్టుబండలూ లేకుండానే మాతో స్నేహం చేసేడు. వాడి దగ్గరకు నడిచి "ఒరే దిబ్బా!" అంటూ చేతిలో చెయ్యి వేసి ఊపేను.

వాడి మొహం కళ కళలాడింది. పెదాలు వికసించేయి. వాడిని చిన్నప్పటి నుంచీ దిబ్బడనే పిలిచేవాళ్ళం.

బండి కదిలింది. నగలో నేను కూర్చుని పగ్గాలు పట్టుకున్నాను. అలవాటైన బాట కావడాన ఎద్దులు సునాయానంగా నడుస్తున్నాయి.

మేఘాలు తేలిపోయాయి. చంద్రుడు నవ్వుతున్నాడు. కొంచెం చలిచలిగా కూడా ఉంది. బాట ఎగుడు దిగుడుగా ఉండటాన బండి చక్రాలు అటూ ఇటూ ఊగుతున్నాయి.

"అయితే ఇన్నేళ్ళూ ఏం చేసేవురా?" దిబ్బడు నన్నడిగేడు చెప్పేను.

"నువ్వు మిల్ట్రీలో చేరినాక ఎప్పుడన్నా యుద్ధం వచ్చిందా?" బాబాయి అడిగేడు.

"యుద్ధమంటే యుద్ధం కాదుగానీ, నాలుగేళ్ళ నుంచి లంకలో ఉన్నాం బాబాయ్!" చెప్పేను.

"ఆ దేశాన ఏంజేసేరు?" అడిగేడు వీర్రాగవులు.

"అక్కడి మిల్ట్రీతో కలిసి మన మిల్ట్రీ వాళ్ళం ఆ దేశాన అరాచకాలు చేసే వాళ్ళను అదుపు చేసేందుకు కెళ్ళేం!" చెప్పేను.

"వాళ్ళను నంపేసేవాళ్ళా?" ఆత్రంగా అడిగేడు వీర్రాగవులు.

"ఆఁ" అని అన్నానో లేదో "అదేందిరా అయ్యా! ఇదేందో ఇసిత్రంగా ఉంది. వాళ్ళ దేశాని కెళ్ళినవాళ్ళను మనము అదుపు చెయ్యడమేంది? వాళ్ళది వాళ్ళు చూసుకోలేరా ఏంది? చూస్తుంటే మిల్ట్రీలో కూడా బల మున్నోడిదే రాజ్యం మాదిరిగా ఉంది" అన్నాడు బాబాయి.

నేను అవు ననలేదు. కాదనలేదు.

"పైనోళ్ళు ఏం చెబితే అది వినాల్సిందే మేం" అన్నాను.

"ఏ మాత్రం వెనకేసే వేమిటి?" వీర్రాగవులు అడిగేడు.

"ఏం వెనకెయ్యడంలే!" నవ్వి ఊరుకున్నాను.

"ఈ కాలానికి నువ్వే నయంరా పెద్దోడా! ఇంట్లోంచి పారిపోయినా గవుర్నెంటు సొమ్ము తింటున్నావు. పొద్దంత రెక్కలు ముక్కలు చేసుకున్నా గాని మా కెప్పుడూ తిండి క్కరువే. రెక్కల్ని నమ్ముకున్నోడు బాగుపడే రోజులు కావులే ఇవి." బాబాయి అన్నాడు.

"అదేంది బాబాయ్! అట్లంటావ్! ఇంతకు ముందులాగా పంటలు పండటం లేదా? వానలు పడక కరువు లొస్తున్నాయా ఏంటి?" నా అనుమానం బయటపెట్టేను.

"రైతుకు కరువులేంది ఎప్పుడురా తండ్రీ? ఏ ఏటి కా ఏడు ఏదో ఒక గండ కత్తెరలో ఇరుక్కోవడమేగా మా బతుకు! అయిదారేళ్ళనాడు పుగాకుకొంటానికో, పత్తికొంటానికో ఎప్పుడూ జీపులూ, లారీలూ తిరిగే ఈ బాట మట్టిదైనా సదరంగా ఉండేది. ఇప్పుడు దీన్ని చూస్తుంటే తెలియడంలా మనూరి బతుకు ఎలా అయిందో! ఎద్దుల బండి కూడా నడవడానికి దోవలేకుండా అయింది." ఆవేదనగా అన్నాడు బాబాయి.

నాకు గతం గుర్తొచ్చింది. ఎప్పుడూ పొగాకు బేరగాళ్ళు జీపుల మీదనో, మోటారు సైకిళ్ళ మీదనో మా ఊరు చుట్టూ తిరిగే వాళ్ళు. చుట్టు పక్కల ఊళ్ళ నుంచి ఆడ కూలీలు పొగాకు గ్రేడింగు చెయ్యడానికి ఈ ఊరికి పొద్దున్నే సద్ది కట్టుకుని వాలే వాళ్ళు. అప్పుడు మా నాన్న నాలుగు బేరన్ల పుగాకు వేసేడు. ఆ సంవత్సరం బాగానే వచ్చింది. మరునటి ఏడు వచ్చిన లాభమూ, పెట్టుబడీ రెండు పోయేయి.

తరువాత సంవత్సరం అమ్మ మెడలో నగలు తాకట్టు పెట్టి పొగాకు వేసేడు నాన్న. ఆ సంవత్సరం తొలిసారిగా తుపాను వచ్చింది. పుగాకు రైతుల గుండెల్లో తొలిసారిగా బాంబులు పేలేయి. పండిన పంటంతా నీళ్ళలో కొట్టుకుపోయింది. అమ్మిన సరుకు క్కూడా బ్రోకర్లు డబ్బు లివ్వలేదు. వాళ్ళ గోడౌన్లూ వరదల్లో కొట్టుకుపోయాయని అబద్ధాలాడేరు. నిజం తెలిసి కూడా రైతులు ఏమీ చేయలేకపోయారు.

నాలుగో సంవత్సరం పుగాకు పెట్టుబడి కోసం అమ్మ మెడలో మిగిలిన తాళిబొట్టు దారం అడిగేడు నాన్న. అమ్మ ఇవ్వనంది.

"ఒసే పిచ్చి మొహమా! నేనింత కష్టపడేది మన కోసం, మన పిల్ల కోసమేగా! నే నేమన్నా డబ్బంత తాగి, తిని పాడు చేస్తున్నానా? కాలం, కర్మం కలిసి రావాలేగాని ఇయ్యేడు పుగాకు ధరలు ఎట్టుంటాయో చూడు! బాంకులో ఉన్న నీ బంగారమంత ఇడిపించకపోతే అప్పు డడుగు" అన్నాడు అమ్మతో.

అమ్మ ససేమిరా వీలు కాదంది. బాంకులో నగలు ఇడిపించనూ వద్దు. నువ్వు కొత్తగా నగలు చేయించి దిగెయ్యనూ వద్దని మొత్తుకుంది. అసలు పొగాకు పంటే వెయ్యవద్దంది.

నాన్న నచ్చ చెప్పబోయాడు. ఏవేవో కొత్త ఆశలు కల్పించపోయాడు. ఎన్ని చెప్పినా అమ్మ మెడలో నుంచి తాళిబొట్టు దారం తీయలేదు.

నాన్న తిట్టేడు. ముఖం కడుక్కుంటూ చేతిలోని ఇత్తడి చెంబును బలంగా అమ్మ మీదికి విసిరేడు. మూతికి తగిలింది. పెదిమ చిట్లింది. పన్ను విరిగింది. నెత్తురు బొటబొటా కారింది. ఏడుస్తూ అమ్మ ఇంట్లోకి పరుగెత్తింది. తమ్ముడు అమ్మను కావిలించుకుని ఏడ్చేడు. నేను పౌరుషంగా నాన్న మీదికి కలబడ్డాను. కోపం కొద్దీ నన్నూ కొట్టేడు నాన్న.

ఆ రోజు సాయంత్రం అమ్మ ఏమనుకుందోగాని మెడలో పసుపు తాడేసుకుని నాన్నకు తాళిబొట్టుదారం ఇచ్చింది. నాన్న పొగనారు తెస్తానని ఆ రాత్రే బయలుదేరి వెళ్ళేడు.

అమ్మ మమ్మల్ని దగ్గరకు తీసుకుని ఏడ్చింది. "పెద్దయ్యాక మీరన్నా నాకు తాళిబొట్టు దారం చేయిస్తారా?" అంది. "సరే"నన్నాను. ఆ రాత్రే ఇల్లు విడిచేను.

అప్పటిదాకా తల్లి కోడి పిల్లల్ని రెక్కల కింద పొదువుకున్నట్టుగా నన్ను పొదువుకున్న ఊరిని విడిచి పెట్టేను. నడి జాము పూట చేలో కంకులుకోసి నలిపి ఊది పాల జొన్నల్ని వచ్చి నజ్జల్ని నోటి కందించిన అమ్మను విడిచేను. నన్ను భుజాల మీది కెక్కించుకుని చేను చుట్టూ గట్ల మీద తిప్పుతూ భారతం కథలు చెప్పిన నాన్నను వదిలి పెట్టేను.

ఎవరికీ చెప్పకుండా ఆ రేత్రే పారిపోయి మిల్ట్రీలో చేరాను.

ఎప్పుడు వెలిగించేడో గాని జానెడు చుట్టను నోట్లో ఉంచుకుని గుప్పు గుప్పుమని వదులుతున్నాడు బాబాయి.

"వసంత పెళ్ళి చేసేవా బాబాయ్?" అడిగేను.

"ఏం పెట్టి చెయ్యమంటావు? చెట్టంత కూతుర్లు ఎదిగి ఇంట్లో కూర్చుంటే కంటికి కునుకూ ఉండదు, కాళ్ళకు నిలకడా ఉండదు. ఏమీ లేనోడి కిచ్చి చేద్దామంటే మన సొప్పుకోదు. కూస్తో కాస్తో మనను పంటోడు, నాలు గెకరాలున్న ఆసామి దొరికినా, నాలుగొందలు సంపాదించే ఉద్యోగస్తులు దొరికినా లక్షలు కుమ్మరించమనే రోజు లొచ్చేయి. ఈ విషయంలో మీ నాయన పనే హాయి. మీరిద్దరు కొడుకులే." నిట్టూరుస్తూ అన్నాడు బాబాయి.

బండి పెద్ద వాగు దగ్గర కొచ్చింది. వాగు ఒడ్డున చెట్లలో నక్కలు అరుస్తూ సయ్యాట లాడుతున్నాయి.

"ఒరేయ్! ఎద్దుల పగ్గాలు గట్టిగా పట్టుకో" అన్నాడు వీర్రాగవులు.

ఎంత బలంగా లాగి పట్టుకున్నా వాగులోకి దూకుడుగా పరుగెత్తించేయి బండిని ఎద్దులు. వాగులో ఆగి కాసిన్ని నీళ్ళు తాగేయి. ఇసుక లోంచి బండి పైకి ఎక్కడం కష్టంగా ఉంది. చిన్నగా కిర్రుమని కదులుతోంది బండి.

వీర్రాగవులు భుజమ్మీద చెయ్యేసి "నారాయణం బాబు ఎట్లున్నాడురా?" అని అడిగేను.

వాడి కళ్ళు ఆ వెన్నెల వెల్తుర్లో చిత్రంగా కొట్టుకున్నాయి. "ఇంకెక్కడి నారాయణ బాబు! నిరుడు ఈ రోజుల్లో పురుగు మందు తాగి పోయేడు." చెప్పేడు బాబాయి

"ఆఁ!" అంటూ వణికి పోయాను నేను.

చాలా సేపు ఎవరమూ మాట్లాడుకోలేదు.

బాబాయి ఆరిపోయిన చుట్టను మళ్ళీ వెలిగించి ఒక నిట్టూర్పుతో చెప్పుకొచ్చేడు.

"పొగాకు పంట లాభం లేదని కొత్తగా మనూరికి పత్తి ఇత్తనం తెచ్చిందే వాడు. తెచ్చిన ఏడాది వాడు వేస్తే బాగానే పండింది. వాడ్ని చూచి అందరూ మళ్ళీ పత్తి వేసేరు. ఆ ఏడూ బాగానే పండింది. పుగాకు మీద చేసిన అప్పులన్నీ తీరాయి అనిపించుకున్నారు అందరూ.

"ఇక చూడు మనోల్లపని! మళ్ళీ ఏడు ఊరు చుట్టూ ఎటు చూసినా పత్తితోటలే పత్తి తోటలు. బాగా పత్తి పిగలబోయే సమయానికి మళ్ళీ తుపానొచ్చింది. ఒక్క చేనూ మిగల్లేదు. అందరి పాలిట మిత్తువయింది తుపాను. ఎవడికీ పెట్టుబడి రాలేదు. అప్పటికీ సగం మంది సతికిల బడ్డారు.

"నాలుగో ఏడు కాళ్ళూ మెడలూ తాకట్టుపెట్టేరు. దొరికినకాడ దొరికినట్లు అప్పులు తెచ్చేరు మళ్ళీ పత్తి వేసేరు. పంట పువ్వు మీదున్నప్పుడు, కాయపడే సీజన్‌లో పడిందిరా తెల్లదోమ! దానమ్మ... ఎన్ని మందులు కొట్టినా దోమ చావదే! పూత, కాయ రాలిపోయింది. పురుగులు మిగిలేయి. ఆ ఏడు పురుగు మందులు రైతును అన్యాయం చేసేయి. ఒరే



## సాగర సౌభాగ్యం

భూమి మీదకన్నా సముద్రాల్లోనే మానవాళికి ఉపయోగపడే అనేక సంపదలు దాగి ఉన్నాయని నేటి పరిశోధకులు నమ్ముతున్నారు. అనే కానేక ప్రయోగాలు జరిపి, సాంకేతిక సామగ్రిని ఉపయోగించి నేడు సముద్రాలలోని గుప్త సంపదను వెలికి తీయడానికి అహర్నిశలూ ప్రయత్నిస్తున్నారు. ఒక ఘనపు మైలు పరిమాణం గల సాగర జలంలో సుమారు అయిదు బిలియన్ డాలర్ల విలువ గల, 180 మిలియన్ టన్నుల రసాయనిక పదార్థాలు ఉంటాయి. అంతే కాకుండా ఈ జలంలో ప్రతి ఘనపు మైలు పరిమాణంలో 90 మిలియన్ డాలర్లు వెల చేసే పుత్తడి, పది మిలియన్ డాలర్లు విలువ గల వెండి నిక్షిప్తమై ఉంటాయి. ప్రతి ఘనపు మైలు ద్రవంలోనూ ఏడు టన్నుల యురేనియం, ఇతర రసాయన పదార్థాలు, మూలకాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఈ లెక్కన మన ప్రపంచంలోని సముద్రాల మొత్తం నీటి విలువ ఒక క్వింటిలియన్ ఐదు వందల క్వాడ్రిలియన్ డాలర్లు అవుతుంది.

భోగా శ్రీనివాసమూర్తి

పెద్దేడా! ఇక రైతు- ఎట్ట బాగుపడాలో చెప్పు?" అంటూ ఆగి మళ్ళీ ఆవేశంగా అందుకున్నాడు బాబాయి.

మధ్యలో వీర్రాగవులు ఏదో మాట్లాడబోతే వాణ్ణి మాట్లాడనీయలేదు.

"అప్పు తెచ్చిన సొమ్మంతా పురుగుల మందు తినేసింది. ఆఖరుకు చేను నిండా పురుగుల మందుల ఖాళీ డబ్బాలు మిగిలేయి. ఆ ఏడు నారాయణ తెంపు చేసి పదిహేనెకరాలు పత్తి చేను వేసేడు. అందరి కంటె ఎక్కువగా ఊళ్ళో దెబ్బతింది వాడే! ఇక చూడు నాసామిరంగా! ఊరు చుట్టూ బ్యాంకులోల్లు, మందుల కొట్టులోల్లూ, రాధయ్యసెట్టీ ఒకరి తెలీకుండా ఒకరు వసూల్ల కోసం రావడం మొదలైంది. అయిన కాడికి పొలాలు తెగనమ్మో, రాధయ్య సెట్టి దగ్గర తాకట్టు పెట్టో కొన్ని అప్పులు తీర్చేరు రైతులు.

"మా నాన్న పరిస్థితి ఎలా ఉంది బాబాయ్?" ఆదుర్దాగా అడిగేను.

ఆయన కోపంగా చెప్పేడు.

"మీ నానేంది, నేనేంది, నారాయణేంది? అందరి పరిస్థితి అదే! అయితే నారాయణ కాస్త నదూకున్నోడు గదా! ఇద్దరు ముగ్గుర్ని తీసుకుని ఇక్కడ లాభం లేదు. బళ్ళారి వెళ్ళి పొలాలు కౌలుకు తీసుకుని పత్తి ఏస్తానని వెళ్ళేరు. రెండేండ్లు బాగానే వచ్చిందని అనుకున్నారు. అనుకోవడం వరకే అది! మూడో ఏడు మళ్ళీ పట్టి చేతుల్తో తిరిగొచ్చేరు. అందరూ వచ్చిన రెండో రోజున బ్యాంకోల్లు అప్పు కట్టలేదని ఇంటి తలుపులు ఊడగొట్టి పట్టుకెళ్ళేరని అవమానపడ్డాడో, నిక్షేపం లాంటి పొలమంతా రాధయ్య సెట్టి తాకట్టులోకి వెళ్ళిందనే ఆలోచించాడో, తన పిల్లలకు తినడానికి తిండే కరువైన స్థితికి తీసుకొచ్చేనని విరక్తి చెందేడోగాని మొత్తమ్మీద పురుగుల మందు తాగి పిల్లల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయాడ్రా." చెప్పేడు బాబాయి.

మా బండి మీదుగా తీతువు అరుచుకుంటూ వెళ్ళింది. దూరాన ఊళ్ళోంచి కోళ్ళు అదే పనిగా కూస్తున్నాయి. బండి చిన్న వాగులో దిగి

## జనగణ'మన' గీతము

రవీంద్రనాథ్ టాగూర్ 'జనగణమన అధినాయక' గీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లి బెసెంట్ థియోసాఫికల్ కాలేజి అతిథి గృహంలో కూర్చొని రాశారట. ఆ గీతాన్ని 1950 జనవరి 24న, జాతీయ గీతంగా ప్రభుత్వం అంగీకరించింది. ఈ గీతాన్ని మొదటి సారి 1911 డిసెంబర్ 27న కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సభలో ఆలపించారు. దీన్ని 'భారత విధాత' అన్న పేరుతో 'బోధిని పత్రిక'లో ప్రచురించారు. దీనికి సంపాదకులు టాగూర్ గారే. దీన్ని టాగూర్ గారే 1919లో 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అనే పేరుతో ఆంగ్లీకరించారు. మొత్తం అయిదు భాగాలుగా ఉన్న ఈ గీతంలోని మొదటి భాగాన్ని మన ప్రభుత్వం అన్ని సందర్భాల్లోను వినిపిస్తూ ఉంటుంది.

వి.విజయలక్ష్మిరెడ్డి
[ప్రొద్దుటూరు]


ఇసుకల్లోంచి 'సర్రు సర్రున పైకి వచ్చింది.

వీర్రాగవులు చిన్నగా ఏడుస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు, నేనూ కళ్ళు తుడుచుకుని వాడి భుజంమ్మీద తట్టేను- ఊరుకోమన్నట్లుగా.

బాబాయి భుజం మీది కండువాతో తుడుచుకున్నాడు. "ఇక మీ నాన్న సంగతంటావా? మీ అమ్మ బంగారమంతా బ్యాంకులో వేలం వేసేరు. ఈయన సంపాదించిన పదెకరాలూ తెగనమ్మేడు. మీ తాత ఇచ్చిపోయిన పదెకరాలలో రాధయ్య సెట్టికి తాకట్టు పెట్టేడు. ఇప్పు డందులోనే సేద్యం చేస్తూ వడ్డీ కింద రాధయ్య సెట్టికి గింజలు కొలుస్తున్నాడు!

చల్లటి గాలి ఊదరగొడుతూంది. ఊరు దగ్గర పడిన గుర్తుగా పుగాకు బ్యార్నీలు కనిపించేయి. అన్నీ విప్పదీసి అమ్మినట్టుంది! పట్టి మొండి గోడలు మిగిలేయి.

వీర్రాగవులు అన్నాడు. "మొన్న మీనాన్న ఏం చేసేడని. బాగా సంపాదిద్దామని ఎవురికీ తెలవకుండా మీ బ్యార్నీ మొండి గోడల్లో గంజాయి మొక్కలు నాటేడు. ఎట్టా తెలిసిందో ఏమో కోసే




సమయానికి పోలీసులొచ్చి పట్టుకెళ్ళారు. లాభమేమోగాని, కేసులనీ - వకీల్లనీ ఇంకో రెండు వేలు ఎదురు ఖర్చయింది. లేకపోతేనా! ఈ పాటికి మీనాన పని మహా రంజుగా ఉండేదిలే!"

మా బాబాయికి బాగా కోపం వచ్చినట్టుంది.

"నోరు ముయ్యరా సొంబేరోడా! మీకేం తెల్సురా మా బాధలు? ఎలా ఉండే వాళ్ళం ఎలా అయిపోయేం! ఒకప్పుడు బుడబుక్కలోల్లూ, చెంచులోల్లూ, కాటికాపరులు మనూరిని నమ్ముకుని బతికిన రోజులున్నాయిరా! ఇవ్వాల తినడానికి ముద్దా, కట్టుకోడానికి గుడ్డా లేని రోజులొచ్చేయి మనకు. ఆ రోజున మీ నాయన పురుగులమందు తాగినా, ఇవాల మా అన్న గంజాయి మొక్కలు నాటినా నలుగుర్లోనూ నామర్దా లేకుండా బతుకుదామనేరా! మన బతుకు లిట్లా ఎందుకయ్యేయో కనుక్కుని బాగు కావడానికి మార్గాలు దేవులాడాల్సింది పోనిచ్చి, పెద్దోల్ల తప్పులు దేవులాడతార్రా బడుద్దాయి?"

"అది కాదు మామా!" అంటూ ఏదో చెప్పబోయాడు వీర్రాగవులు.

బాబాయి వినిపించుకోకుండా "నోరెత్తావంటే నే నూర్కోను" అని గదిగేడు. వీర్రాగవులు చిన్నబుచ్చుకున్నాడు.

మాటల్లో పడి గమనించలేదు కాని చంద్రుడు వెలవెల బోతున్నాడు. ఆకాశం కొద్ది కొద్దిగా కుంకుమ రంగు పులుముకుంటోంది. ఊళ్లోంచి కుక్కల అరుపులు వినబడుతున్నాయి. గ్రామ బొడ్డురాయి దాటేము. కోళ్ళు గుంపులు గుంపులుగా పొలాల్లోకి వెడుతున్నాయి. ఇప్పుడు ఊరు స్పష్టంగా కనబడుతోంది.

మునుపటి అందం లేదు. మునుపటి సందడి లేదు. అప్పుడు తెల్లారుతోందంటే హడావుడిగా ఉండేది. జొన్నలు తొక్కుతున్న రోకళ్లు గోల చేసేవి. జీతగాళ్లు పెద్ద పెద్దగా మాట్లాడుకుంటూ అరకలు కట్టుకుని పొలం దారి పట్టేవాళ్లు. ఇప్పుడవేవీ కనబడలేదు.

ఏ తుపాను రాక్షసో కాటేసిన గుర్తుగా ఇళ్లన్నీ కొద్దిగానో, పెద్దగానో జరిగిపోయి ఉన్నాయి. జరిగిన ఇళ్లను విప్పదీసి కట్టుకునే పరిస్థితిలో కూడా లేనట్టుంది.

మా ఇంటి ముందు బండాగింది.

కళ్ళాపు చల్లుతున్న అమ్మ ఆగిపోయింది.

నోట్లో వేప్పుల్ల వేసుకుని పొలికట్టెతో రోడ్ల దగ్గర శుభ్రం చేస్తున్నా నాన్న తలెత్తి చూచాడు.

ఎంత మార్పు!

వృద్ధాప్యం ఎంత నిర్దాక్షిణ్యమైనదో!

ఇంటి ముందు కొమ్ముల బర్రె నెమరేస్తూ చూస్తూంది. బండి దిగేను. యుద్ధంలో పోయిన కాలుని ఈడ్చుకుంటూ రెండడుగులు వేసేను. అమ్మా నాన్నా దగ్గర కొచ్చేరు.

"ఏందన్నా అట్లా చూస్తావు? మన పెద్దోడు కదూ?" అన్నాడు బాబాయి.

అమ్మ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. నాన్న కళ్ళల్లో మెరుపులు కనిపించేయి. అమ్మ మంచం వాల్చింది. నన్నానుకుని నాన్న కూర్చున్నాడు. తన్మయం చెందేను. అమ్మా నా కొయ్య కాలు

తడిమి చూస్తూ భోరుమంది.

నాన్న వినుక్కున్నాడు.

"ఊరుకో! ఏమిటి బుద్ధి లేకుండా ఏడుపులు అయిందానికీ, కానిదానికీ" అన్నాడు.

నాన్న నిబ్బరానికి తల వంచేను.

అమ్మ నాలో చిన్నప్పటి తన కొడుకును దేవులాడుతోంది. అప్పటికే బాబాయి ఊరంతా చెప్పినట్టుంది. ఒక్కొక్కరే నన్ను పలకరించడాని కొస్తున్నారు.

ఆ రోజు ఊరంతా తిరిగేను. అందర్నీ కలిసేను. పేరు పేరునా పిలిచేను. జొన్న సంకటి తిన్నాను. తాటి ముంజల్ని కాయలోంచి గోరుతో జుబికాను. ఈతకాయల చప్పరించి ఊసేను. ఈ పదేళ్ళ నుంచీ నేను కోల్పోయిందేమిటో నాకు తెలిసొచ్చింది. నన్ను చూచి అందరూ సంబరపడ్డారు. ఇంతవాడు ఎంత వాడయ్యేడురా?" అన్నారు పెద్దోళ్లు. చిన్న పిల్లలు మిల్ట్రీ సంగతులు చెప్పమని కళ్ళు పెద్దవి చేసి మరీ విన్నారు. వరసైన ఆడపిల్లలు గోడల మీంచి, తలుపుల పక్క నుంచీ తొంగి తొంగి చూసేరు.

దీపాలు పెట్టే వేళకు ఇంటికి చేరుకున్నాను. అమ్మ అరుబయట మంచాలేసి పక్క లేసింది. నాన్న నేను అన్నం తిన్నాము. చంద్రు డొచ్చాడు. అమ్మ అన్నం తెచ్చుకుని బయట మంచం మీద కూర్చుని తింటోంది.

నే నొచ్చేనని అమ్మ తమ్ముడికి కబురు పంపింది. వాడు రేపొస్తాడు.

గాలి నా మీంచి పాటలు పాడుతూ వయ్యారాలు పోతోంది. అలసి పోయానేమో గాఢంగా నిద్ర పట్టింది.

నిద్ర నిండా కలలే! కల ల్నిండా నేనూ, మా ఊరూ నిండిపోయాము.

మెలకు వొచ్చింది. మంచం మీది పక్కంతా చల్లగా మెత్తగా అయ్యింది. ముళ్ళ కంప లోంచి కీచురాళ్ళు రొద పెడుతున్నాయి. నిద్ర తేలిపోయింది.

అమ్మా, నాన్నా మాట్లాడుకుంటున్నారు. ఎక్క డెక్కడ సంబంధా లున్నాయో ఆరాలు తీస్తూ చెప్పుకుంటున్నారు. నేనొచ్చి ఒక్క రోజన్నా కాలేదు. నా పెళ్ళి గురించి మాట్లాడుకుంటున్నారు వాళ్ళు.

అమ్మ అంది - "అబ్బాయి నాకు పాతిక వే లిచ్చి బంగారం చేయించుకోమన్నాడు. రే పొక సారి కంసాలి బత్తున్ని రమ్మను" అని.

నాన్న చాలా సేపు మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో పడ్డాడు. తొలి కోడి కూసింది.

"మాట్లాడవేంది?" అమ్మ రెట్టించింది.

"బంగారం దేముందే పిచ్చి మొహమా! కాలం, కర్మం కలిసి రావాలే కాని ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. ఇప్పుడు మన కంటూ చారెడు నేల కూడా లేదు. ఈసారికి తాళిబొట్టు దారం చేయించుకో. మిగిలిన డబ్బుల్తో మన పొలం తాకట్టు ఇడిపించుకుందాం" అన్నాడు నాన్న.

నేను ఉలిక్కిపడ్డాను. నాన్న మళ్ళీ 'ఊబి' లోకి దిగడం లేదు కదా అనిపించింది నాకు. మళ్ళీ నా ఆలోచనకు నేనే సిగ్గుపడ్డాను.

"అదేం దయ్యా! అబ్బాయి అంత ప్రేమగా ఇచ్చి బంగారం చేయించుకోమంటే" అమ్మ ఆగింది.

"ఒసే వాజమ్మా! మనిషి బతకడానికి పిడికెడు గింజలు కావాల్నా వద్దా? నచ్చాక పూడ్చి పెట్టడానికో, కాలవడానికో చారెడు మట్టి కావల్నా వద్దా? ను వ్వీ సారి తాళిబొట్టు దారం చేయించుకో. అబ్బాయి నేను చెబితే వింటాడులే. మన తాతల్నాటినుంచి వస్తున్న పొలం తాకట్టు ఇడిపించుకుందాం" లేచి నిల్చున్నాడు నాన్న.

ఆయన మాటల్లో అభ్యర్థన కన్నా ఆజ్ఞ ఎక్కువగా ధ్వనించింది. అమ్మ 'సరే' నన్నట్టుగా తలూపింది.

తెల్లారింది.

నాన్న కండువా భుజానేసుకుని బత్తుల్నీ, రాధయ్య సెట్టినీ కలిసొస్తానని బయలుదేరాడు.

★

